# విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 29 ఏప్రిల్ 2025 8 పేజీలు


# అడ్డగోలుగా అక్రమ కట్టడాలు

- ఇష్టానుసారంగా రోడ్డు ఆక్రమణలు
- నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు
- సెట్‌బ్యాక్‌లకు మంగళం
- షాపుల ముందు పార్కింగ్ కరువు
- కాసులిస్తే కళ్లు మూసుకుంటున్న అధికారులు
- టౌన్ ప్లానింగ్ విభాగంపై అవినీతి విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : అక్రమ కట్టడాలకు కేరాఫ్‌గా బాపట్ల పట్టణం దూసుకుపోతుంది. కూసంత అనుమతితో బహుళ అంతస్తుల భవనాలు కట్టిన మనల్ని ఆపేవాడు ఏవరూ అంటూ భవన నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. దీంతో బాపట్ల పట్టణం అక్రమ కట్టడాలకు అడ్డాగా మారింది. పట్టణంలో ఒకే అంతస్తుకు అనుమతి తీసుకుని అదనపు అంతస్తులు నిర్మించినా.. గృహావసరాలకు నిర్మించిన భవనాలను వాణిజ్యానికి వినియోగించినా.. అధికారులు కాసుల మత్తులో చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని బహిరంగ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రజల సేవలో తరించాల్సిన మున్సిపల్ అధికారులు కాసుల వేటలో ఉరకలు తీస్తున్నారు. ప్రజా సమస్యలు పారిశుద్ధ్యం, దోమల నివారణ, తాగునీటి తదితర సమస్యలు గాలికొదిలేసి ఆదాయ మార్గాల అన్వేషణలో నిమగ్నమైయ్యారు. అక్రమ కట్టడాలు రోడ్డు స్థలాల అక్రమణల వల్ల వచ్చే అక్రమ సంపదతో బాపట్ల మున్సిపల్ అధికారుల తీరు మూడు పువ్వులు ఆరుకాయలుగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో షాపులకు పార్కింగ్ లేక రోడ్డుపైనే ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా.. అక్రమ కట్టడాలు అక్రమణలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించటంపై ప్రజల ఆరోపణలు వాస్తవమే అని అర్థం చేసుకోవచ్చు.

- ప్రజా శ్రేయస్సు కోసం భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు ఉండాలన్న సంకల్పంతో చేసిన చట్టం.. టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమ సంపాదనకు ప్రధాన మూలంగా మారింది. తమ కళ్ళముందే నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు కడుతున్నా..రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా..వ్యాపారాలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చూసి చూడనట్లు మిగతా 2 లో ...

# 'బర్లి' రైతులను ఆదుకోండి

- మంత్రి 'అచ్చెన్న'తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ
- రేపు పొగాకు కంపెనీలతో సమావేశం
- ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఏలూరి

విశాలాంధ్ర - యద్దనపూడి : బర్లి పొగాకు రైతుల సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి కలిసి పొగాకు సమస్య తీవ్రతను వివరించారు. పొగాకు రైతులు సరైన ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతాంగానికి న్యాయం చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతాంగానికి అండగా నిలవాలని మంత్రిని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. వాణిజ్య పంటగా భావించే పొగాకు ఎకరానికి లక్షన్నర పెట్టుబడి మిగతా 2 లో ...

# మెరుగైన వైద్య సేవలు అందించండి

**మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి**

విశాలాంధ్ర-కొండపి : ప్రభుత్వ ఆసుపత్రులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంత్రి తన క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి, కొండపి నియోజకవర్గ వైద్య అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి ప్రభుత్వ ఆసుపత్రిలో ఐపీ విభాగంలో మేల్ వార్డు, ఫీ మేల్ వార్డు, స్టోర్ రూమ్‌లకు సంబంధించి పలు మార్పులపై చర్చించారు. ఒంగోలు రిమ్స్‌లో పెయింటింగ్ పనులపై మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు, పరికరాలు ఏర్పాటు చేస్తాం అన్నారు.

# జీవన ప్రమాణాలను పెంపొందించాలి

**కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**

విశాలాంధ్ర-ఒంగోలు : పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటికి తగ్గట్టుగా సృజనాత్మకంగా ఆలోచించి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందేలా నియోజక వర్గ స్థాయి విజన్ ప్లాన్ ను రూపొందించడంలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సూచించారు. సోమవారం ఒంగోలులోని ఎన్జీఓ హోమ్‌లో స్వర్ణాంధ్ర -2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా నియోజక వర్గాల విజన్ డాక్యుమెంట్ రూపకల్పన, ముఖ్య నిర్దేశిత లక్ష్యాలపై ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఏర్పాటుచేసిన వర్క్ షాప్‌లో కలెక్టర్ కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం నియోజక వర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్ ను తయారు చేయుటకు అవసరమైన శిక్షణ ఇచ్చుటకు ఈ రోజు వర్క్ షాప్‌ను నిర్వహించడం జరుగుచున్నదన్నారు. రానున్న సంవత్సరాల కాలంలో ఏ సెక్టార్‌లో అభివృద్ధి, వృద్ధి రేటు ఎలా ఉంటుంది, వాటిని ఎలా అభివృద్ధి చేయాలన్న అంశాలపై నియోజక వర్గాల వారీగా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజక వర్గాల యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేయాలి

- కొణిదెన ఎస్సీ కాలనీలో తాగునీటికి కటకట
- సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - అద్దంకి : బల్లికురవ మండలం కొణిదెన ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య జటిలంగా మారింది. కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శుద్ధజల కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ఎంపీడీవో కె.కుసుమకుమారికి వినతిపత్రం అందజేశారు. సింగరకొండ మాట్లాడుతూ..350 కుటుంబాలు, 1200 మంది జనాభా ఉన్న కాలనీలో నాలుగేళ్లుగా తాగునీటి సరఫరా నిలిచి పోయిందన్నారు. శుద్ధజల కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ మండల కార్యదర్శులు గెల్లా వెంకటప్పయ్య, నిమ్మల చిన్నప్పయ్య, నాయకులు గెల్లా బాబు, గెల్లా అంజయ్య, పావులూరి చౌదరి బాబు, షేక్. ముస్తఫా, షేక్.నాగూర్ వలి పాల్గొన్నారు.

## పకడ్బందీగా నీట్ పరీక్ష నిర్వహించాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

2లో

## దళితుల స్మశాన భూమి ఆక్రమణ

ఆర్డీవోకు ఫిర్యాదు

5లో

## అర్జీలను వేగంగా పరిష్కరించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో వచ్చే అర్జీల పై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారధి, మాధురి, శ్రీమతి విజయజ్యోతి లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించా లన్నారు. వివిధ శాఖల్లో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారంచూపాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈరోజు నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో 268 వినతులు వచ్చాయి.

## 'కిషోర్ వికాసం' కార్యక్రమంపై అవగాహన

విశాలాంధ్ర - కనిగిరి : మండల పరిధిలోని కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిషోర్ వికాస్ కార్యక్రమం పై అవగాహన సమావేశాన్ని సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురవాజిపేట, వగ్గంపల్లి సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలకు కిషోర్ వికాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ గ్రామంలో 15 నుంచి 18 సంవత్సరాల కిషోర్ బాలికల వివరములు ప్రొఫార్మా ప్రకారం సర్వే చేసి ఇవ్వాలన్నారు. వీరికి మే 2 నుంచి జూన్ 10 వరకు కిషోర్ వికాసం కార్యక్రమాన్ని ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించాలని. బాల్యవివాహాల నిషేధం, బాలికల అక్రమ రవాణా, అత్యాచారాల నిర్మూలన, పోషకాహారం, బాలిక విద్య, పరిశుభ్రత మొదలగు అంశాలపై అవగాహన కలిగించ బడునని కార్యకర్తలకు వివరించారు. అనంతరం బాల్యవివాహాల నిషేధ చట్టం2006, లైంగిక వేధింపులను ఆపండి, ఐటిసి బంగారు భవిష్యత్తు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. వేసవికాలంలో అంగన్వాడీ పాఠశాలలోని పిల్లలకు మంచినీరు అందుబాటులో ఉంచాలని, బాల సంజీవిని యాప్ లో బెనిఫిషరీస్ కి ఎఫ్ఆర్ఎస్ పూర్తి చేసి టిహెచ్ఆర్ ఇవ్వాలన్నారు.

## అడ్డగోలుగా అక్రమ కట్టడాలు

**(మొదటిపేజీ తరువాయి)**

వ్యవహరిస్తున్నారు. ఎన్ని అక్రమ కట్టడాలు జరిగితే తమకే అంత లాభం అనే పంథాలో మున్సిపల్ అధికారులు ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్న యజమానులతో బేరసారాలకు దిగుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడళ్లలోనే అనేక అక్రమ భవనాల నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలు సెట్‌బ్యాక్‌లకు మంగళం పాడుతూ నిర్మాణాలు జరుగుతున్నా అధికారుల అలసత్వం వహిస్తున్నారు.

- టౌన్ ప్లానింగ్ అధికారుల అలసత్వం, అవినీతి అక్రమాల వల్లే బాపట్ల పట్టణంలో అడ్డగోలుగా అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ చట్టం ప్రకారం అనుమతులు పొంది నిర్మాణాలు చేసిన భవనాలను పరిశీలిస్తే టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు కళ్లకు కట్టినట్లు తెలుస్తుంది. సాధారణ ఇళ్లతో పాటు కమర్షియల్ భవనాలు, సెల్లార్ ఉన్న భవనాలు, ఫంక్షన్ హాల్లు సైతం సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేస్తున్నారంటే టౌన్ ప్లానింగ్ అధికారుల మౌనం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు బాపట్ల పట్టణంలో మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు తీరుపై దృష్టి సారించాలని పు:ర ప్రజలు కోరుతున్నారు.

## పకడ్బందీగా నీట్ పరీక్ష నిర్వహించాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్ యు.జి 2025)ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. సోమవారం, కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నీట్ యూజీ 2025 జిల్లా స్థాయి కో- ఆర్డినేషన్ కమిటీ సమావేశంను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ యుజి ప్రవేశ పరీక్షను మే 4 న నిర్వహించబడునని ఆయన అన్నారు. జిల్లాలో చీరాలలోని యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల/ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షకు మొత్తం 416 మంది విద్యార్థులు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుండి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాలలో పరీక్ష రాసే ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు దూరం దూరంగా కుర్చీలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష హాల్లోనికి వెలుతురు బాగా వచ్చే విధంగా ఉండాలన్నారు. విద్యార్థులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరిగే హాలుకు నెంబర్లను వేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా నోటీసు బోర్డులను, హాల్ నెంబర్లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరిగే ప్రాంతంలో 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆయన ఆదేశించారు. కస్టోడియన్ బ్యాంకు కు వచ్చిన పరీక్ష పేపర్లను హాల్ సూపరింటెండెంట్లు పోలీసు వారి సహకారంతో తీసుకురావాలన్నారు. పరీక్ష పేపర్లను తీసుకురావడానికి, పరీక్ష కేంద్రం వద్ద సెక్యూరిటీ కొరకు ఎంత మంది పోలీసు సిబ్బంది కావాలో తెలుపుతూ పోలీస్ శాఖ వారికి లేఖ వ్రాయాలని నీట్ యూజీ నోడల్ అధికారికి ఆయన సూచించారు. పరీక్షా కేంద్రంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రంలో ఎటువంటి మాస్ కాపీయింగ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలని నోడల్ అధికారిని ఆయన ఆదేశించారు. పరీక్ష నిర్వహించే రూములను ముందుగా తనిఖీ చేసి వాటిని జిల్లా రెవెన్యూ అధికారి, పోలీస్ అధికారులు, నీట్ యూజీ నోడల్ అధికారి సమక్షంలో ఒకరోజు ముందు సీల్ వేయాలని, తదుపరి పరీక్ష జరిగే రోజున ఉదయం సీల్ వేసిన అధికారుల సమక్షంలోనే పరీక్ష గదులకు సీల్ తీయాలని ఆయన అధికారులకు సూచించారు. పిడబ్ల్యుడి విద్యార్థుల కొరకు పరీక్షా కేంద్రంలో వీల్ చైర్లను, సహాయకులను ఏర్పాటు చేయాలని ఆయన నోడల్ అధికారికి సూచించారు.

## డీఎస్సీ నిర్వహణలో 'టెట్'ను మినహాయించాలి

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల ప్రభాకర్ డిమాండ్
- అభ్యర్థుల వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలి

విశాలాంధ్ర - కనిగిరి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ లో టెట్ క్వాలిఫై కాని అభ్యర్థులకు అవకాశం కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల ప్రభాకర్ డిమాండ్ చేశారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు మాత్రమే డీఎస్సీ రాయడానికి అర్హులుగా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలియజేశారు. కానీ గతంలో టెట్ పరీక్ష రాసిన అభ్యర్థులలో 50 శాతం మాత్రమే క్వాలిఫై అయ్యారన్నారు. మిగిలిన 50 శాతం అభ్యర్థులు పేపర్ కష్టతరంగా ఉండడంతో అనర్హులుగా మిగిలారన్నారు. ఎన్‌సిటిఇ నిబంధనలు అలాగే జి వో నెంబర్ 51 ప్రకారం ప్రతి 6 నెలలకు ఒకసారి టెట్ నిర్వహించాలని నిబంధన ఉందన్నారు. కానీ రాష్ట్రంలో టెట్ పరీక్ష నిర్వహించి ఆరు నెలలు దాటిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డీఎస్సీ కి ముందు రెండు సార్లు, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత క్వాలిఫై కానీ అభ్యర్థుల కోసం టెట్ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించి డీఎస్సీ ని టెట్ తో పాటు టీఆర్టి నీ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే అప్పటి డీఎస్సీ నోటిఫికేషన్ లో డిఈడి, బీఈడీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులకు అవకాశం కల్పించారన్నారు. ఇప్పుడు అదే చంద్రబాబు నాయుడు టెట్ పరీక్ష నిర్వహించి ఆరు నెలలు గడిచినా టెట్ నిర్వహించకపోవడం అలాగే డిఈడి బిఈడి ఫైనల్ ఇయర్ అభ్యర్థులకు అవకాశం కల్పించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం వల్ల 1లక్ష 81 మంది టెట్ క్వాలిఫై కాని అభ్యర్థులు అలాగే డిఈడి, బీఈడీ ఫైనలియర్ అభ్యర్థులు 1 లక్ష మొత్తం 3 లక్షల మంది డిఎస్సీ రాసే అర్హతను కోల్పోవాల్సి వస్తుందన్నారు. నోటిఫికేషన్ ఇవ్వక 7సం. కావస్తుందని ఇప్పుడు విడుదల చేసిన నోటిఫికేషన్ లో టెట్ తో పాటు టిఆర్టి ఇచ్చి వీరందరికీ నూతన డీఎస్సీలో అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆరు, ఏడు సంవత్సరాలుగా నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో అభ్యర్థులు వయో పరిమితి అర్హతను కోల్పోవాల్సి వస్తుందని అటువంటి అభ్యర్థులను దృష్టిలో ఉంచుకొని వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 'బర్లీ' రైతులను ఆదుకోండి

**(మొదటిపేజీ తరువాయి)**

వెచించి సాగు చేశారన్నారు. స్పందించిన మంత్రి మంగళవారం సెక్రటేరియట్‌లో పొగాకు కంపెనీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అధికారులు ఆదేశించారు. ఆయా కంపెనీలతో ప్రిన్సిపల్ సెక్రటరీ అధ్యక్షతన సమావేశం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

**ఆందోళన వద్దు అండగా ఉంటాం**

**: ఎమ్మెల్యే ఏలూరి**

నల్లబర్లీ పొగాకు రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. రైతులకు సరైన ధర అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రతి రైతు వద్ద పంటను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే ఏలూరి ప్రకటించారు. రైతులెవ్వరు ఆందోళన పడాల్సిన పనిలేదని ప్రభుత్వం పొగాకు కంపెనీలతో సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

**- రైతు సమస్యలను మంత్రి దృష్టికి....**

రైతాంగ సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన ఎమ్మెల్యే ఏలూరి అన్నదాతల తరపున కూటమి ప్రభుత్వాన్ని సమస్య పరిష్కారానికి చొరవ ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఏలూరి నేరుగా వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయ్యారు. ఆరుగాలం కష్టపడి రైతుల పండించిన పంట చేతికందే సమయంలో సరైన మద్దతు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించినట్లు తెలిపారు. గతంలో పొగాకు 18 వేలకు కొనుగోలు చేశారని తెలిపారు. రైతులు నల్లబర్లీ పంట అధికంగా సాగు చేయడంతో పాటు కంపెనీలు కొనుగోలుకు ముందుకు రావడం లేదని మంత్రికి వివరించారు. గతంలో రేటుకు తగ్గకుండా ఈసారి పంటను కొనుగోలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. రైతులు అత్యధిక పెట్టుబడులతో నల్లబర్లీ సాగు చేశారని పేర్కొన్నారు. ఈ ఏడాది పంట దిగుబడి పెరగడం, కూలీ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పంట కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు సాగు చేయడం వల్ల వడ్డీలు పెరగడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి త్వరితగతిన పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ప్రభుత్వం రంగంలోకి దిగి ప్రత్యక్ష కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. నల్లబర్లీ పొగాకు పంట అత్యధికంగా విదేశాలకు ఎగుమతి అవుతుందని, విదేశీ మారక ద్రవ్యం ఆర్జించే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఏలూరి మంత్రికి వివరించారు. ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం కూడా సమకూరుతుందని పేర్కొన్నారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని రైతులకు అండగా నిలవాలన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రైతులకు మేలు జరిగేలా రైతులకు అండగా ఉంటామని పేర్కొన్నారు.

**సీఎం చంద్రబాబు దృష్టికి**

**పొగాకు సమస్య..**

పర్చూరు నియోజకవర్గంలోని పెద్దగంజాం కొత్త గొల్లపాలెంలో పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు గతంలో హాజరయ్యారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నల్లబర్లీ రైతులు పొగాకు కొనుగోలు లేక సరైన ధర లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే ఏలూరి సీఎంకు సమస్యను వివరించారు. అలాగే తక్కువ నీటి లభ్యతతో ఈ పంట సాగు అవుతుందని సీఎంకు వివరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పండిన నల్లబర్లీ విదేశాలకు ఎగుమతి అవుతుందని తెలిపారు. నల్లబర్లీ పొగాకు అత్యధికంగా ఇంగ్లాండ్ కు వెళుతుందని వివరించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు పంట కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రమాదానికి పిలుపు...ఈ మలుపు

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ఎదురుగా గల అర్ధ వృత్తాకారంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ మలుపులో ఇప్పటికే పలు వాహనాలు ప్రమాదాలకు గురవటంతో ఎందరో తీవ్ర గాయాల పాలయ్యారు. ఆటో బోల్తా పడి అయ్యప్ప దీక్షలో ఉన్న బాలుడు సైతం మృతి చెందాడు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహ సెంటర్ నుండి రుద్రసముద్రం గ్రామం వరకు 10 కిమీ పారిశ్రామిక కారిడార్ కోసం రెండు వరుసల రోడ్డును టీడీపీ ప్రభుత్వంలోనే ఎంతో నాణ్యతతో నిర్మించారు. నిత్యం రద్దీగా మారిన ఈ రహదారి మలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు, గతుకులు లేక పోవడంతో మితి మీరిన వేగంగా ప్రయాణించటమే ప్రమాదాలకు కారణంగా మారింది. ప్రస్తుతం రోడ్డుకు మలుపు ఉన్న వైపు పెరిగిన చిల్లచెట్లు వలన ఎదురుగా వచ్చే వాహనాన్ని గమనించలేకపోవడానికి మరో కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించి, స్పీడు బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : బాల్య వివాహాల నిరోధించ దానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం కిశోర వికాసం కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మే2వ తేదీ నుండి జూన్ 10వరకు అన్ని గ్రామ పంచాయితీలలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించుట, విద్యను కొనసాగించుట, రక్షణ, భద్రత, హైజీన్ వాతవరణంలో అభివృద్ధి తదితర విషయాల గురించి 15నుండి 18సంవత్సరాల వయసు వారికి వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ నీలోఫర్ బేగం, లీగల్ అడ్వైజర్ రత్నప్రసాద్, వైద్యాధికారి పృథ్వీరాజ్, మహిళా పోలీసులు, వీవోఏలు, ఏఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యారవను సన్మానించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ ను మండలం లోని రావిగుంటపల్లి టిడిపి అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

**ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య**

విశాలాంధ్ర-పామూరు రూరల్ : గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలు మరియు శానిటేషన్, త్రాగు నీరు సమస్యలు పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ గృహ లబ్ధిదారులు ను చైతన్య పరచి గృహ నిర్మాణాలు ను వేగవంతం కావాలని, నూరు శాతం గ్రామాలలో శానిటేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ జి.అరవింద రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వై రమేష్ గారు గృహ నిర్మాణ అసిస్టెంట్ ఇంజనీర్ రాజమోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

## అమరావతి పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలి : పువ్వాడి

విశాలాంధ్ర-పామూరు : మే నెల 2వ తేదీన అమరావతిలో జరుగు అమరావతి పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. అమరావతి పునర్నిర్మాణ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వస్తున్నందున కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్ళేందుకు సన్నాహ సమావేశం సోమవారం కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో జరిగింది. కనిగిరి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు గంగోడి నాగేశ్వరరావు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసమావేశంలో పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పామూరు మండలం నుండి అధిక సంఖ్యలో అమరావతి పునర్నిర్మాణ సభకు హాజరు అవుతామన్నారు.

## పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సయ్యద్ ఆలీ జహీర్ ఎన్నిక



విశాలాంధ్ర-మార్కాపురం : పట్టణ బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. మొత్తం 138 మంది ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో 3 ఓట్లు మురిగిపోయాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులైన కె.శ్రీనివాస చౌదరి, సయ్యద్ అలీ జహీర్లు ఇద్దరు పోటీ పడగా జహీర్ కు 83 ఓట్లు రాగా, శ్రీనివాస చౌదరికి 52 ఓట్లు లభించాయి. దీంతో 31 ఓట్ల ఆధిక్యంతో అలీ జహీర్ విజయం సాధించారు. కార్యదర్శి పదవికి వై.అనిల్ కుమార్, నాగేంద్ర రాజులు పోటీ పడగా కేవలం 4 ఓట్ల తేడాతో నాగేంద్ర గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా ఉమ్మడి రవీంద్రనాథ్,జాయింట్ సెక్రటరీగా జవ్వాజి మధు సూదన్ రెడ్డి, కోశాధికారిగా డి జె. స్టాలిన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా బత్తుల వేణు గోపాల్, పైడిమర్రి రామచంద్ర లు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన నూతన కమిటీని పలువురు న్యాయవాదులు అభినందించారు.

## వైసీపీ బలోపేతానికి కృషి చేస్తా

**మండల కన్వీనర్ మల్లికార్జున రెడ్డి**

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్ఆర్ సీపీ నూతన మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి అన్నారు. పొన్నలూరులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసి వైసీపీని అన్ని విధాలుగా బలోపేతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులపై దాడులు చేసి కేసులు పెట్టడం తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించి వారి తరపున పోరాటం చేస్తామన్నారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరిని అవలంభిస్తుందన్నారు. రాబోవు రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ కోసం పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పెండింగ్ అర్జీలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రెవెన్యూ సమస్యల కొరకు వచ్చిన పెండింగ్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రెవెన్యూ సమస్యల కొరకు అర్జీలు అందజేశారని, ఎన్ని పరిష్కరించారో వివరాలు తెలియజేయాలన్నారు. పరిష్కరించకపోతే వాటికి గల కారణాలు తెలియజేయాలన్నారు. రెవెన్యూ సమస్యల కొరకు వచ్చిన అర్జీలను అధికారులు వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఎంఆర్ఐ పి వి ఎస్ ఆర్ మూర్తి, మండల సర్వేయర్ సిహెచ్ కోటమరాజు, సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ వి.కృష్ణ ప్రసాద్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ తెలిపారు. అందులో నాలుగు అర్జీలు పొలాలను ఆన్లైన్ చేయాలని కోరుతూ అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, ఎంఆర్ఐ పివి ఎస్ ఆర్ మూర్తి, సర్వేయర్ సిహెచ్ కోటమరాజు, సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ వి.కృష్ణ ప్రసాద్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీల్లో హైరిస్క్ లక్షణాలను గుర్తించండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : నెలలు నిండిన గర్భవతులలో హై రిస్క్ లక్షణాలు గుర్తించాలని వైద్యాధికారి బి.మధు శంకర్ అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భవతులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వేసవికాలంలో పాటించవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. వడదెబ్బ వేడి దెబ్బ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారికి తెలియజేశారు. ప్రతి గర్భవతికి బీపీ, షుగర్ తో పాటు అల్బుమిన్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. గర్భవతికి వచ్చేటువంటి హై రిస్క్ లక్షణాలను గుర్తించి వారికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ డి వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ కోలాహలం అప్పలరాజు, సూపర్వైజర్ సిహెచ్ నాగేశ్వరరావు, ఏ.అంజమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com మంగళవారం 29 । ఏప్రిల్ । 2025

## దోర్నాలలో బంగారు బాల్యం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండలంలోని యం.పి.డి.ఓ కార్యాలయం నందు, ఐసిడిఎస్ సిడిపిఓ వి.కమల కుమారి ఆధ్వర్యంలో బంగారు బాల్యం కార్యక్రమంపై మహిళ పోలీసు లకు, విఓఏ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిషోరి వికాసం పై దృష్టి సారించి 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయసు గల బాలికల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. వారిని గ్రూపులుగా విభజించి సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని చూసించారు. యం.ఈ ఓ బి.మస్తాన్ నాయక్ మాట్లాడుతూ ఈ క్యాంపుల్లో బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత బాల్య వివాహాల నివారణ, చైల్డ్ లేబర్ ప్రభుత్వ పథకాల పై అవగాహన కల్పించాలన్నారు, ప్రతి గ్రూపులో యం.యస్.కె కన్వీనర్ గా అంగన్ వాడి వర్కర్ , ఆశ వర్కర్, విఓఏ సభ్యులు గా ఉంటారని తెలిపారు, వారంలో రెండు సార్లు మంగళవారం, శుక్రవారం, ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపియం (ఇంచార్జి) మూల.వెంకిరెడ్డి, ఎపిఓ యస్.చాణుక్య, ఐసిడిఎస్ సూపర్ వైజర్ యన్.అంజమ్మ, మండలంలోని అన్ని గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

## మేధాశక్తిని పెంచేవే గ్రంథాలయాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : గ్రంథాలయాలు మేధా శక్తిని పెంచుతాయని మండల విద్యాశాఖ అధికారి మస్తాన్ నాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన దోర్నాలలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన, మండల విద్యాశాఖ అధికారి మస్తాన్ నాయక్, మరియు పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు వేసవి విజ్ఞాన శిబిరము ప్రారంభించారు. విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది. విద్యార్థిని విద్యార్థులకుఎన్ శివ కోటేశ్వరావు గ్రంథాలయాలు వాటి వలన ఉపయోగాలు, వేసవిలో చక్కగా గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని వివరించడం జరిగింది. తదుపరి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన మస్తాన్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయాలను ఎలా ఉపయోగించుకోవాలి, వాటి వల్ల ఉపయోగాలు, చక్కగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించడం జరిగినది. నేను కూడా ఈ గ్రంథాలయంలో చదివి ఈ స్థాయికి వచ్చినాను, కాబట్టి మీరు ఇప్పటి నుండే గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. మంచి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు పాలకుడు డి వెంకటసుబ్బారెడ్డి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంపీపీ
## గుమ్మ పద్మజా యల్లేష్‌కు సన్మానం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల ఎంపీపీ గుమ్మ పద్మజా యల్లేషుకు ఉత్తమ ఎంపీపీ అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం మండల కేంద్రమైన దోర్నాల్లోని సాయి మందిరంలో సాయిబాబా ట్రస్ట్ తరపున ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్‌కు సాయిబాబా ట్రస్ట్ వారు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం పట్ల వారు అభినందనీయం తెలియజేశారు.

# తీగలేరు కాలువను పొడిగించాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, వెంటనే పూర్తి చేసి, తీగలేరు కాలువను పుల్లలచెరువు చిన్న కంద్లేరు రిజర్వాయర్ వరకు పొడిగించాలని రైతు సంఘం నాయకులు జీవి గురునాధం, కేజే రఘు, ఎల్. రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాచకొండలో సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో వారు సమావేశం నిర్వహించారు. తీగలేరు కాలువ ఆవశ్యకత, వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పై అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అత్యంత వెనుక బడిన ప్రాంతం పుల్లలచెరువుకు, పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో గల తీగలేరు టి-5 కాలవను పుల్లలచెరువులో ఉన్న చిన్న కంద్లేరు చెరువు వరకు విస్తరించి, నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రైతులంతా కలిసి ప్రభుత్వానికి పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమావేశానికి రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి తీగలేరు కాలువను పుల్లచెరువు వరకూ విస్తరించాలని, లేకుంటే ఈ ప్రాంతం ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. రైతు సంఘం నాయకులు బాణాల. రామయ్య, నారు.వెంకట రెడ్డి, బంగారురెడ్డి, యల్లారెడ్డి, రామిరెడ్డి, వెంకట రమణ, ఎరుకలయ్య, వెంకటరాములు, వెలుగొండ ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## 150 మందికి గుండె పరీక్షలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని గుమ్మళ్ళంపాడు గ్రామం నందు సోమవారం విజయవాడ హెల్ప్ హాస్పటల్ వారి సౌజన్యంతో డాక్టర్ జి కిరణ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి రోగులకు ఉచితంగా ఈసీజీ గుండె స్కానింగ్ పరీక్షలు వైద్య సేవలు అందించారు. గుండెకు సంబంధించి అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా విజయవాడ హెల్ప్ హాస్పిటల్ లో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యులు కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ పిఆర్ఓ ఎం సంతోష్ టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మొలకలపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నెప్పలి కనకయ్య టిడిపి నాయకులు బొడ్డపాటి వెంకటరమణారావు బొడ్డపాటి చంద్రశేఖర్ రావు బొడ్డపాటి శ్రీనివాసరావు బొడ్డపాటి వెంకటరామయ్య శ్రీనివాసరావు పున్నారావు శేషాద్రి శేషు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక గ్రంథాలయం నందు సోమవారం గ్రంథ పాలకుడు కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో వేసవి శిక్షన తరగతులను ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టరు ఏ కరుణాకరరావు హాజరై ప్రారంభించారు. కరుణాకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ వేసవి శిక్షణా తరగతులను చక్కగా వినియోగించుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతులుమానసిక విజ్ఞాన ఉన్నతకి దోహదపడతాయని. స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తక పఠనం జీవితానికి పునాది వేసే విధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలకు వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానంద రెడ్డి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్యం కొరకు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానంద రెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్ళ గ్రామంలో సోమవారం ఒంగోలు కిమ్స్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో కంటి, గుండె సమస్యకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. కిమ్స్ వైద్యులు రామాంజనేయులు, సునీల్ 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో 15 మందికి కంటి, గుండె సంబంధించిన సమస్యల కొరకు కిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కార్పొరేటు స్థాయిలో వైద్య శిబిరాలు చేసి ఉచితంగా మందులు అందించడం జరుగుతుంది అన్నారు. గ్రామస్తులు ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డిని పూలమాలతో దుశాల్వాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుంకర హనుమారెడ్డి, రావులపల్లి నాగార్జున, మైలా బ్రహ్మం, సుంకర చిన్న బ్రహ్మ రెడ్డి, అన్నం శ్రీనివాసరావు, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా స్పోర్ట్స్ మీట్‌కు
## కదిరి బాబురావు కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో మే నెల 5,6వ తేదీలలో జరిగే ఆల్ ఇండియా వ్యవసాయ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు సిఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మునయ్య,సుదేవు, యమున సోమవారం బయలుదేరి వెళ్లారు.

# వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయండి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ఏలూరి రామచంద్రారెడ్డి వినతి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : నిరంతరం కరవు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి వరప్రసాదమైన శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని కోరుతూ ఏపీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్‌ను సోమవారం బీజేపీ కార్యాలయంలో వారధి కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజలకు నేటికీ ఆర్ ఆర్ ప్యాకేజీ మంజూరు రాకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన అన్నారు. వీరికి తక్షణమే ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు. పెద్దారవీడు మండలం సుంకేసుల, కలనూతల తదితర గ్రామాలలో వెయ్యి అడుగులకు పైగా బోరు వేసినప్పటికీ నీరు రావడం లేదంటే భూగర్భ జలాలు ఈ ప్రాంతంలో ఏ స్థాయిలో అడుగంటి పోయాయో దీన్నిబట్టి స్పష్టంగా అర్థమవుతుందని ఆయన అన్నారు. నిర్మాణ పనులు పూర్తికాకుండానే కేవలం ఎన్నికల్లో ఓట్ల రూపంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకే నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నానని చెప్పి ఈ ప్రాంత ప్రజలను నిట్ట నిలువున మోసం చేశారని ఆయన అన్నారు. ప్రాజెక్టు పూర్తి అయితే 4 లక్షల 32 వేల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మంది ప్రజలకు డ్రింకింగ్ వాటర్ అందడంతో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 32 మండలాలు సస్యశ్యామలం అవుతాయని ఆయన గుర్తు చేశారు.

## ట్రావెల్ బస్సును ఢీకొన్న టిప్పర్ ...
### ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర - అద్దంకి : ట్రావెల్ బస్సును టిప్పర్ ఢీకొని ముగ్గురు ప్రయాణికులకు గాయాలైన సంఘటన మండలంలోని చిన్నకొత్తపల్లి వద్ద హైవేపై సోమవారం వేకువజామున జరిగింది. హైదరాబాద్ నుంచి కందుకూరు వెళ్తున్న ట్రావెల్ బస్సును చిన్న కొత్తపల్లి వద్ద టిప్పర్ ఢీకొనడంతో బస్సులో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. అద్దంకి 108 సిబ్బంది చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చీరాల : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ అక్కడే మృతి చెందిన సంఘటన చీరాల కారంచేడు రహదారులని ఫ్రైడ్ స్కూల్ సమీపంలో సోమవారం వేకువజామున జరిగింది. చీరాల వైపుకు వస్తున్న ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటన ఆఘటన ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడ మృతి చెందిన దేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు ప్రయాణిస్తున్న ద్రిచక్ర వాహనం స్పెండర్ నెంబర్ ఏపీ నెంబర్ ఏపీ 12 ఎల్ 848గా అయితే మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే వెంటనే ఒకటో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావుని నెంబర్ 9121102141 సంప్రదించాలని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల : స్థానిక శాఖ గ్రంథాలయానికి చెందిన వేసవి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి పి.సుబ్రమణ్యేశ్వరరావు హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గ్రంధాలయానికి వెళ్ళి అక్కడి పుస్తకాలు మ్యాగజైన్లను చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని సూచించారు. ప్రథమ రోజు శిక్షణ తరగతులకు 28 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం చెస్, క్యారం,లూడో వంటి ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. గ్రంధాలయాధికారి శ్రీమతి. ధనమ్మ, విద్యా శాఖ అధికారి శ్రీ. పి. సుబ్రమణ్యేశ్వర్‌రావు, ఇంగ్లీష్ మాస్టర్‌లు పాల్గొన్నారు.

## కిషోర్ వికాసంపై సమావేశం

విశాలాంధ్ర - యద్దనపూడి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సుభద్ర మాట్లాడుతూ కిషోర్ వికాసం పై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కిషోర్ బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఏ రోజు ఏ థీమ్ చేయవలసింది వివరించారు. ఏ పి ఎం వెంకట్రావు మాట్లాడుతూ కిషోరీ బాలికలకు జరిగే కార్యక్రమాలలో గ్రామ సమైక్య సభ్యుల సహకారం అందిస్తామని, పొదుపు విషయమై ఎట్లాంటి చర్యలు నేర్చుకోవచ్చు తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ హర్ష, సూపర్వైజర్ సిహెచ్ సుజాత, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు ఏఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ నాయకుల అరెస్టు అన్యాయం

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షుడు బాపట్ల రవికుమార్**

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బీసీల సమస్యల పరిష్కారం పై పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల విశ్వశాంతి ఉన్నత పాఠశాల సమీపంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన, రక్షణ చట్టం, రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ విజయవాడలో ఆదివారం జరిగిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరుల నాయకులను అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీసీల సమస్యల పరిష్కారం పై చిత్తశుద్ధిగా పనిచేస్తామన్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చేయకపోవడం బాధాకరమన్నారు. ఇదే పోకడ పోతే భవిష్యత్తులో తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. బీసీలను విస్మరించమని సాక్షాత్తు సీఎం నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇచ్చిన హామీలను మరవరాదని విజ్ఞప్తి చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గ ఎమ్మెల్యేలకు తమ సమస్యలు వినతి పత్రాలను అందజేయడానికి ప్రణాళిక రూపొందించమన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. బీసీ గర్జన కూడా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శులు మారం రవికుమార్ ఎన్ ఎస్ పి రాజు, యువజన నాయకుడు కంకణాల రాంబాబు, ప్రతిపాటి సాయి కుమార్, నాగూర్ పాల్గొన్నారు.

## పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమారెడ్డి**

విశాలాంధ్ర-పర్చూరు: ప్రభుత్వం పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.హనుమారెడ్డి తెలిపారు. పర్చూరు నియోజవర్గంలోని పర్చూరు అద్దంకి నంచారమ్మ కళ్యాణమండపం, ఇంకొల్లులోని బాలికల హైస్కూల్ నందు సోమవారం పొగాకు రైతు సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, రైతుల పోరాటాలతోనే ప్రభుత్వంలో కదిలిక వచ్చిందని, అంతమాత్రన అద్భుతాలు జరగవని తెలిపారు. రైతులు ఐక్యంగా ఉండి పోరాటాలు బలంగా ఉండాలని, ప్రభుత్వాలు రాజకీయంగా భయపడాలని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. మే 5న సీఎం చంద్రబాబును కలిసే కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ పొగాకు గిట్టుబాటు ధర పోరాటాలతోనే సాధ్యమని అది భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉంటుందని తెలిపారు. నల్లమడ రైతు సంఘ అధ్యక్షులు కొల్లా రాజమోహనరావు మాట్లాడుతూ రైతులు ఆర్థిక స్థిరత్వం కోసం పంటలు పండిస్తున్నారని, పొగాకు రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టం వస్తుందని తెలిపారు. గత ఏడాది 50 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేశారని, ప్రస్తుతం 70 మిలియన్ కేజీల పొగాకు ఉన్నదని తెలిపారు. రాజకీయాలకు, కులాలకు, మతాలకు అతీతంగా రైతులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## దళితుల స్మశాన భూమి ఆక్రమణ

**ఆర్డీవోకు దళితులు ఫిర్యాదు**

విశాలాంధ్ర -రేపల్లె : రేపల్లె మండలం పిరాట్ లంక గ్రామానికి చెందిన సుమారు 50 మంది దళితులు తమ స్వాధీన అనుభవంలో గల స్మశాన భూమిని కొంతమంది అగ్రకులాల వారు ఆక్రమించుకొని తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆక్రమణలను తొలగించి తగు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నాడు రేపల్లె ఆర్డీవో కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. భూమి వద్దకు వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. చోడయిపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 261.1 ఏ నందు ఒక ఎకరం 60 సెంట్లు భూమిని అప్పటి ప్రభుత్వం దళితుల స్మశాన వాటికకు స్వాధీనం చేసి ఉన్నారని, అప్పటినుండి భూమి దళితుల స్వాధీన అనుభవం లోనే స్మశాన భూమి ఉందని, దీనిపై తగు విచారణ చేసి దళితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేయగా సీనియర్ న్యాయవాది దారం సాంబశివరావు సమక్షంలో దళితులు తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.

## మతోన్మాద దాడులు అరికట్టాలని ర్యాలీ

విశాలాంధ్ర-తాడికొండ : మతోన్మాద దాడులను అరికట్టాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం తాడికొండ, బండారుపల్లి గ్రామాలలో నిరసన ర్యాలీ చేపట్టారు. మతసామరస్యాన్ని కాపాడాలి అంటూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, పూర్ణ అధిక సంఖ్యలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నిరసన

విశాలాంధ్ర - చీరాల : వేటపాలెం మండల యూటీఎఫ్ అధ్యక్షుడిపై ఆరోపణలకు వ్యతిరేకంగా ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన వేటపాలెం మండలం శాఖ యూటీఎఫ్ అధ్యక్షుడు పింజల శ్రీనివాసరావు యొక్క అంగవైకల్యంపై నిరాధార ఆరోపణలు చేస్తూ సీహెచ్ శ్రీనివాసరావు ఒంగోలు డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీస్ వారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసారు. సిద్ధం పాపారావు, జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి, బండి బిక్షాలు బాబు, పాలెపు సురేష్, కుర్రా రామారావు, కుర్రా శ్రీనివాసరావు, పింజల శ్రీనివాసరావు, జి శ్రీమన్నారాయణ, గవిని నాగేశ్వరరావు, గౌరాబత్తుని సూరిబాబు, పింజల మురళీకృష్ణ, బుద్ధి పద్మ, డి సరళలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు షాపులు కేటాయించాలి

విశాలాంధ్ర - చీరాల : చీరాల పట్టణ పరిధిలోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లలో రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగులకు షాపులను కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా చీరాల మునిసిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ కు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ను కలిశామన్నారు. నూతనంగా నిర్మించిన కాంప్లెక్స్ లో దివ్యాంగులకు ఐదు శాతం, అద్దెలో యాభై శాతం రాయితీతో ఇస్తామని అధికారులు చెప్పారన్నారు. మొగల్, సాలేహా, వెంకటేశ్వర్లు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలి

## రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డే హనుమరెడ్డి

విశాలాంధ్ర - ఇంకొల్లు : కంపెనీలు పొగాకు కొనాలంటే ఐక్యంగా ఉద్యమం చేస్తే సాధ్యమవుతుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డే హనుమ రెడ్డి అన్నారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని సోమవారం ఆంధ్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హనుమరెడ్డి మాట్లాడుతూ నల్ల బర్లి పొగాకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వాలు,పాలకులు, కంపెనీలపై ఒత్తిడి తేవాలన్నారు. గతంలో పొగాకు బోర్డు రావాలంటే పెద్ద ఉద్యమం జరిగితేనే వచ్చిందని అలాగే సుబాబుల్ కొనుగోలు చేయాలన్నా కూడా ఉద్యమంలో సాధ్యమైందన్నారు. మనం ఓటు వేసి గెలిపించిన వాళ్ళు మన ఉద్యమం చేయకపోతే దాని గురించి అసలు పట్టించుకోరని తెలిపారు. కంపెనీకి సంబంధించిన మధ్యవర్తులు ఎవరైనా బెదిరిస్తే వాటికి భయపడాల్సిన అవసరం లేదని మనమంతా ఏకంగా పోరాడితేనే ఏదైనా సాధించగలమన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు రైతు సమస్యలు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు చేసిన పోరాట ఫలితమే విజయం సాధించగలిగామని రైతులకు గుర్తు చేశారు. మే నెలలో పొగాకు కొనుగోలు సమస్యపై ముఖ్యమంత్రిని కలిసి కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. వి.కృష్ణయ్య, ఎం హరిబాబు, రాజమోహన్, సిహెచ్ గంగయ్య, రమాదేవి,తలపనేని రామారావు, రాయని వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర -రేపల్లె : అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కొరకు మే 2 న రాష్ట్ర పర్యటనకు వస్తున్న భారత ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఖాధీ,గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్ కేకే చౌదరి తెలిపారు.పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుండి కూటమి నాయకులు, కార్యకర్తలు అమరావతి లో జరిగే సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనగాని శివప్రసాద్, జీవి నాగేశ్వరరావు, జి శ్రీనివాసరావు, పంతాన్ని మురళీధర్ రావు, కే వెంకటేశ్వరరావు, తాత ఏడుకొండలు, వెనిగళ్ళ శివ సుబ్రహ్మణ్యం, ధర్మతేజ, రవిశంకర్, మల్లాది రామకృష్ణ, చింతల సుబ్బారావు, చంద్రబాబు, పి వెంకట్ యాదవ్, పట్టణ అధ్యక్షులు పట్టాభి రామారావు, రూరల్ అధ్యక్షులు రామాంజనేయులు, జనసేన పార్టీ రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త ఎం భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు ఆర్ మహేష్, బిజెపి రేపల్లె నియోజకవర్గం ఇన్చార్జి ఇంకొల్లు మాణిక్యాలరావు, బిజెపి పట్టణ అధ్యక్షులు వాకా శివరాం ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అమరావతి సభకు జన సమీకరణపై సమీక్ష

విశాలాంధ్ర - సంతమాగులూరు : అమరావతి పునఃనిర్మాణం పనులు మే 2వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. అందులో భాగంగా సంతమాగులూరు మండలం నుంచి అమరావతికి జన సమీకరణ కోసం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అతిథిగా రాష్ట్ర గ్రంథాలయం ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు హాజరై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు సమన్వయంతో అమరావతి సభకు భారీ ఎత్తున ప్రజలను తరలించాలని పిలుపునిచ్చారు. ఈ సభ కోసం సంతమాగులూరు మండలానికి 20 బస్సులు, 100 ప్రత్యేక కార్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి, జనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, తహశీల్దార్ కె.రవిబాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఏపీఎం హనుమంతరావు, టీడీపీ నేత చేవూరి వాసురెడ్డి పాల్గొన్నారు.

## కుట్టుమిషన్ శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - సంతమాగులూరు : రాష్ట్ర స్కిల్ డవలప్మెంట్ వారి సౌజన్యంతో సంతమాగులూరు మండల స్థాయిలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జ్యోతిర్మయి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అతిథులుగా తహశీల్దార్ కె.రవిబాబు, సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, మండల టీడీపీ నేత చేవూరి వాసురెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, స్వశక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, ఉచితంగా కుట్టు మిషన్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ విడతలో 144 మంది పేర్లు నమోదు చేసుకోగా, ప్రస్తుతం 75 మంది శిక్షణకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు, తిరిగి 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మానందం, శిక్షకురాలు చింతా లక్ష్మీ పాల్గొన్నారు.

## వసతులు ఏర్పాటు చేయాలి:ఎంపీడీవో

విశాలాంధ్ర - నిజాంపట్నం : భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతి సభకు నిజాంపట్నం మండలం నుంచి వెళ్లే ప్రజలకు, డ్వాక్రా సంఘాల మహిళలకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ఆదేశించారు.ఈ మేరకు సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, డీఆర్డీఏ వెలుగు సిబ్బందితో ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.మే 2న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన ఉన్న సందర్భంగా ఆ సభకు నిజాంపట్నం మండలం నుంచి ప్రజలు, డ్వాక్రా సంఘాల మహిళలు వెళ్లేందుకు 7 బస్సులను కేటాయించారని, ప్రతి బస్సులో మొత్తం 50 మందిని ఎక్కించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.బస్సులో ఉన్న వారికి త్రాగునీరు, అల్పాహారం, భోజన వసతులు ఏర్పాట్లు చేయాలని అలాగే ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, మందులతో ఏఎన్ఎంలు బస్సులలో ఉండాలన్నారు. బస్సు బయలు దేరినప్పటి నుండి తిరిగి వారి స్వగ్రామాలకు సురక్షితంగా వచ్చే వరకు బాధ్యత వహించాలని ఎంపీడీవో ఆదేశించారు.

## సృజనాత్మకతకు వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు వేసవి శిక్షణ తరగతులు ఎంత గానో ఉపయోగపడతాయని నిజాంపట్నం శాఖ గ్రంథాలయ అధికారిణి ఎన్.విజయలక్ష్మి అన్నారు.వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం సందర్భంగా సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మరింత పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. పాఠశాలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు ఇంట్లో ఖాళీగా ఉండకుండా వారిని తల్లిదండ్రులు గ్రంథాలయాలకు తప్పక పంపించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్లు కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - బేస్తవారిపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, డ్రాయింగ్, కథలు చెప్పడం, కథలు చదివించడం జరిగినది. 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ సీహెచ్ గంగాధర్, ఉపాధ్యాయులు సుజాత, పీవీ గురుస్వామి, పాఠకులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల ఆచూకీ తెలియలేదు...

విశాలాంధ్ర - యద్దనపూడి : గత ఏడాది డిసెంబర్ 13 వ తేదీన ఒక బాబు ఇంటి నుంచి తప్పిపోయి ఐదు నెలల అవుతున్న ఎంతవరకి తల్లిదండ్రులు ఆచూకీ లభించని సంఘటన యద్దనపూడి మండల పరిధిలో జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం ఒక బాలుడు గత ఏడాది డిసెంబర్ 13 వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో యద్దనపూడి మండలం పూనూరు గ్రామం నుండి గన్నవరం వైపు వచ్చే మార్గమధ్యలో బాబు ఒంటరిగా ఏడుస్తూ ఉండగా అటుగా వస్తున్న వ్యక్తి ఆ బాబును పేరు వివరాలను అడగగా చెప్పలేక పోవటంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించగా తాత్కాలిక ఆశ్రమం కొరకు సిడబ్ల్యూసి ప్రకాశం జిల్లా వారికి అప్పగించారు. ఎన్నిసార్లు బాబు యొక్క తల్లిదండ్రుల కోసం ప్రయత్నించినప్పటికీ తెలియలేదు ఆచూకీ తెలిసినవారు యద్దనపూడి ఎస్సై రత్నకుమారి ఫోన్ నెంబర్ : 9121102153 జి.కోటేశ్వరమ్మ 7207986210,సిడిపిఓ పర్వార్ 9491051623 సంప్రదించాలన్నారు.

## తహసీల్దార్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం తహశీల్దారుగా పనిచేస్తూ జిల్లాలోని యర్రగొండపాలెం తహశీల్దారుగా బదిలీ అయిన మంజునాధరెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. తహశీల్దారు కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీఎస్‌పురం మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బోయళ్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎస్‌పురం తహశీల్దారుగా పనిచేసిన మంజునాధరెడ్డి మండల ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఒక్క అవినీతి మచ్చలేకుండా పనిచేశారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరికూటి హనుమంత, రేనాటి వెంకటేశ్వర్లు, సంగిశెట్టి సుబ్బారావు, పసుపులేటి గురుకృష్ణ, నల్లమడుగుల టీడీపీ నాయకులు షేక్ అక్బర్, జర్నలిస్టులు ఎస్‌పి నాయుడు, కె రమేష్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడే కార్యకర్తలకు అండగా టీడీపీ

## కడియాల రమేష్

విశాలాంధ్ర-ముండ్లమూరు : టిడిపి పార్టీకి కష్టపడే వ్యక్తులకే పార్టీ అండగా ఉంటుందని టిడిపి సీనియర్ నాయకులు కడియాల రమేష్ అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని టిడిపి నాయకులు గుంటుపల్లి రంగనాయకుల ఇంటి వద్ద సోమవారం గ్రామ పార్టీ అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా కడియాల రమేష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను కార్యకర్తలకు ప్రజలకు అందేలా నూతనంగా ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్షులు చూడాలన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు గా ముండ్లమూరు మేదరమెట్ల పిచ్చారావు, నూజిలపల్లి భోగ్యం ఏడుకొండలు, పసుపుగల్లు గూడాల శివశంకర్ రెడ్డి, సింగన పాలెం కందిమల్ల వెంకటసుబ్బయ్య, కెల్లంపల్లి కుంటాశ్రీనివాసరావు లు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు మేదరమెట్ల వెంకటరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టిడిపి మాజీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి వరగాని పౌలు, కొక్కెర నాగరాజు మాజీ ఎంపీటీసీ సుంకర రాఘవరెడ్డి, గుద్దేటి నారాయణరెడ్డి, మాజీ సర్పంచి ఇందూరి పిచ్చిరెడ్డి, చావా బ్రహ్మయ్య, బద్రి భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ నిడమానూరు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుంటా యోగేశ్వరి వెంకట సుబ్బారావు, మేదరమెట్ల నారాయణస్వామి, కుమ్మిత పేరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి పునఃనిర్మాణ సభ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మే నెల 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులు ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని పరిశీలకులు, గూడూరు నియోజక వర్గ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ అన్నారు. స్థానిక గోలి సదాశివరావు కళ్యాణ మంటపంలో చీరాల నియోజక వర్గ శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం నిర్వహించిన కూటమి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి నిర్మాణ పనులు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి అవుతున్నాయన్నారు. అందులో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రజలందరూ తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ కౌతరపు జనార్ధన్ రావు, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత తెదేపా పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, నాసిక వీరభద్రయ్య, గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం, భాజపా నాయకులు మువ్వల వెంకట రమణారావు, జనసేన నాయకులు గూడూరు శివరామ ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## వెంకటమ్మ కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర -చీమకుర్తి : చీమకుర్తి మండలం భూసరపల్లి గ్రామంలో ఎల్లయ్య నగర్ లో జనరాజు పల్లి సాల్మన్ రాజు సతీమణి వెంకటమ్మ ఆకస్మిక మృతి తెలుసుకొని ఆమె భౌతికాయానికి వారి కుటుంబ సభ్యులకు పరామర్శించిన చీమకుర్తి జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పట్టణ కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, యాకోబ్, స్థానిక నాయకులు సందర్శించి నివాళులర్పించారు. వేమా ఎల్ఐ నగర్ ఏర్పడు ద్వారా వంద కుటుంబాలకు పైగా గతంలో ఆశ్చర్యాన్ని కల్పిస్తే ఈరోజు వందల కుటుంబాలతో వేమా ఎల్లయ్య నగర అభివృద్ధి చెందిందని ఆ కాలనీ నిర్మాణానికి సాల్మన్ అండగా నిలిచి వెంకటమ్మ తోడ్పడునందించిందని తెలిపారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - తాళ్లూరుః పెండింగ్ సమస్యలను తక్షణ పరిష్కారానికి విఆర్ఎలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సంజీవ రావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు సమస్యలపై ఆయన దృష్టి సారించారు. పెండింగ్లో ఉన్న ఫైల్స్ క్లియరెన్స్‌కు తగిన చర్యలు తీసుకున్నారు. సర్వే డిటీ ప్రశాంత్, సర్వేయర్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం ఇబ్బందులు...



విశాలాంధ్ర - తాళ్లూరు: మండల కేంద్రమైన తాళ్లూరుకు గత రెండు రోజులుగా సాగర్ తాగు నీరు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కార్యాలయాల పరిధిలో ఉన్న ప్రధాన ట్యాంకులో సైతం చుక్క నీరు లేక పోవటంతో ప్రజలు కార్యాలయాల వద్దకు తాగు నీటి కోసం వచ్చి వెనుతిరుగుతున్నారు. మండుతున్న ఎండలకు తోడు తాగు నీరు రాక పోవటంతో సాగర్ నీరు అలవాటు అయిన ప్రజలు మినరల్ వాటర్ తాగ లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. గత నెలలో కూడ మూడు రోజుల పాటు నీరు లేక ఇబ్బందులు పడ్డారు. తరచూ ఇలా తాగు నీరు రాక పోవటం ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగు నీటి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి పట్టణంలో మున్సిపల్ ఆఫీస్ దగ్గరలో గల యుటిఎఫ్ ఆఫీస్ కార్యాలయం నందు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ గోపవరపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ గొల్లపూడి రమాదేవి, మరియు మున్సిపల్ కమిషనర్ వై. రామకృష్ణయ్య చేతులమీదుగా కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కేంద్రం నందు ఒక బ్యాచ్కి 25 మిషన్లు ఏర్పాటు చేసి ఉదయం 9 గంటల నుండి ఒక బ్యాచ్, మధ్యాహ్నం రెండు గంటల నుండి మరొక బ్యాచ్, మొట్టమొదటి 90 మందికి మొదటి విడతగా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రం నందు ప్రతి మహిళా ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ తీసుకుని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని స్వయంగా ఉపాధి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే నమోదు చేయించు కోవాలని, కౌన్సిలర్లు తప్పెట బాబురావు, భీమన వెంకట్రావు, టిడిపి నాయకులు కందిమళ్ళ గంగాధర్ రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, సూరంపల్లి హనుమంతరావు, రావిపాటి రాంబాబు, అవనిగడ్డ శేషారావు, మెప్మా ఆర్పీలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండల నూతన తహశీల్దార్‌గా కె వెంకటేశ్వరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పొన్నలూరు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కె వెంకటేశ్వరావు జిల్లా అంతర్గత బదిలీల్లో భాగంగా పుల్లలచెరువు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే మధ్యవర్తులను సంప్రదించకుండా రైతులు సూచించారు.

## సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని బొట్లగూడురు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పారిశ్రామిక వేత్త కోటపాటి జనార్ధన్ రావు, సుశీల దంపతుల కుమార్తె డాక్టర్ లక్ష్మీశ్రీ వివాహం మే 10 తేదీన జరుగునున్నది. వివాహ మహోత్సవానికి హాజరు కావాలని సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అమరావతిలో సోమవారం తకుటుంబ సభ్యులు తో కలిసి జనార్ధన్‌రావు శుభలేఖను అందజేసారు.

## సమస్యల పరిష్కరించాలంటూ వైద్యాధికారులకు వినతి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : సిహెచ్ఓల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధి కారులు ఎస్పీ బాలయ్య సురేఖలకు మండలంలోని సిహెచ్ఓలు గురువారం వినతిపత్రం అందజేశారు .ఎఫ్ ఆర్ ఎస్ రద్దుచేసి ఆరు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారందరిని రెగ్యులర్ చేయాలని, ఎన్మాస్ బిల్లులు చెల్లించి విద్యుత్ ఛార్జీలు రూమ్ అద్దెలు చెల్లించాలని, ముఖ్యంగా హెచ్ఆర్ పాలసీ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 నెలల ఇన్సెంటివ్ బిల్లులుచెల్లించాలని కోరారు. ఈనెల 15 నుంచి సమ్మె చేస్తున్న మా న్యాయమైన సమస్యలు, డిమాండ్లను సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. మా న్యాయమైన డిమాండ్లను ఉన్నతాధికారులను దృష్టికి తీసుకుపోవాలని వైద్యాధికారులను వేడుకున్నారు. సిహెచ్ఓలు పాల్గొన్నారు.

## నిర్మల ఫార్మసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-మంగ ళగిరి: ఆత్మకూరు లోని నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమ వారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫార్మసీ కళాశాలల నుంచి 25 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడ్ ప్లస్ ఫార్మసీ ప్రతినిధి బి.జయకర్ రాజా, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం.ప్రశాంతి, సిహెచ్.భార్గవ్ గోపి పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఎన్ఆర్ఈజీఎస్ నూతన భవనం నంద సోమవారం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో డి సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచితంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న టైలరింగ్ శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలల పాటు 142 మంది మహిళలకు రెండు బ్యాచిలకు ఈ శిక్షణ ను ఇవ్వనున్నారు. ఈ శిక్షణ పొందిన అనంతరం మహిళలకు జీవనోపాధి పొందవచ్చును అన్నారు. ఈ టైలరింగ్ శిక్షణా కార్యక్రమంలో ఎంపీపీ బుడంగుంట విజయ జడ్పిటిసి దుంపా రమణమ్మ మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు రాష్ట్ర టిడిపి కార్యదర్శి అడకా స్వాములు సర్పంచ్ దర్శి నాగమణి మాజీ సర్పంచ్ రంప తోటి అంకారావు మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు ఎన్.మాధవి లత టైలరింగ్ శిక్షణ జిల్లా రిసోర్స్ పర్సన్ వెంకటరత్నం సిబ్బంది శిక్షణా మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com మంగళవారం 29 । ఏప్రిల్ । 2025

# రాజధాని శంకుస్థాపనను విజయవంతం చేయాలి

## ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : అమరావతి రాజధాని నూతన నిర్మాణంలో భాగంగా శంకుస్థాపనకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు పిలుపునిచ్చారు. సోమవారం వేమూరులోని శ్రీ లక్ష్మీ గణపతి కళ్యాణ మండపంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణాన్ని గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విధ్వంసం చేసిందన్నారు.మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో అమరావతి రాజధాని పునః నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని ఆనందబాబు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ అమరావతి రాజధాని శంకుస్థాపన కోసం వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలో నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో రావాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి గంగాధర్, మండల పార్టీల అధ్యక్షులు దండే సుబ్బారావు, మైనేని మురళీకృష్ణ, శేషుబాబు, ఎల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబా, శివారెడ్డి, అమ్మిశెట్టి కిషోర్,బట్టు మల్లిఖార్జున్,దొప్పలపూడి సుధాకర్, షేక్ అనీఫ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాకిస్థానీయులు తక్షణమే భారతదేశం విడిచి వెళ్ళాలి

### జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో ఎవరైనా పాకిస్థానీయులు నివాసం ఉంటుంటే తక్షణం దేశం వదిలి వెళ్లాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటన వలన భారత్ పాక్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో, భారతీయ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పాకిస్తాన్ జాతీయుల వీసాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందున పాకిస్తాన్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని సోమవారం జిల్లా ఎస్పీ ఆదేశాలను జారీ చేశారు. అధికారికంగా ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పాకిస్తానీలు అధికారికంగా ఎవరు లేరని ఎవరైనా అక్రమంగా ఉన్నట్లయితే వెంటనే దేశం వదిలి వెళ్లాలని ఎస్పీ తెలిపారు. లేనియెడల వీసా నిబంధనలు ఇతర చట్ట ఉల్లంఘనల కింద కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివిధ కోణాలలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ వర్గాలు ఆరా తీస్తున్నాయన్నారు. తక్షణ వీసాలు, వ్యాపారం, సినిమా, జర్నలిజం, రవాణా, సమావేశాలు, పర్వతారోహణ, విద్యార్థి, సందర్శన(విజిటర్స్), బృంద పర్యటనలు(గ్రూప్ టూరిస్ట్), యాత్రిక(పిలిగ్రిమ్స్), పాకిస్తాన్ దేశీ యాత్రిక బృంద వీసాలు వంటి వాటిపై ఎవరైనా జిల్లాలో ఉంటే తక్షణం దేశం విడిచి వెళ్ళాలని ఎస్పీ తెలిపారు. పాకిస్తాన్ వీసాలతో ఎవరైనా అక్రమంగా నివసిస్తుంటే అట్టివారిపైన, అటువంటి వారికి ఆశ్రయం ఇచ్చిన వారిపైనా చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పాకిస్తానీయులు ఉన్నట్లు తెలిస్తే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు.

## వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం

విశాలాంధ్ర - కొల్లూరు : కొల్లూరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల సోమవారం ప్రారంభమైయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీడీపీ మండలాధ్యక్షులు మైనేని మురళీకృష్ణ హాజరై సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.తదుపరి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థినీ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి వేసవి శిక్షణా శిబిరములకు హాజరై విజ్ఞానం పెంపొందించుకోవాలని, గ్రంథాలయాల వేసవి విజ్ఞానశిబిరాలలో చదువుతో పాటు ఆటలు,పాటలు,యోగ,స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తారని వాటిని ఉపయోగించుకొని విద్యార్థిని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.కొల్లూరు శాఖా గ్రంథాలయ అధికారి వై. రాంబాబు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలు ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు జరుగు కార్యక్రమానికి విద్యార్థినీ విద్యార్థులు హాజరై వేసవి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సూచించారు.

# పెన్షనర్ల సమస్యలకు సత్వరమే పరిష్కారం

విశాలాంధ్ర -రేపల్లె : రేపల్లె సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షనర్ల సమస్యలను సత్వరం పరిష్కరించడం జరుగుతుందని రేపల్లె సబ్ ట్రెజరీ అధికారి ఏ మల్లికార్జునరావు అన్నారు. సోమవారం రేపల్లె పట్టణ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకుని వస్తే అప్పటికప్పుడు పరిష్కరించి పెన్షనర్లకు సీనియర్ సిటిజన్లకు ట్రెజరీ సేవలు అందిస్తామని వివరించారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ తరపున అధ్యక్షులు జె సుబ్బారావు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ట్రెజరీ అధికారి దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు జే సుబ్బారావు, కార్యదర్శి రాజారత్నం, కోశాధికారి నాగేశ్వరరావు, సభ్యులు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, కాళిదాసు, రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి ఫుట్‌బాల్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఎంతోమందిని ఉత్తమ ఫుట్ బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి సీనియర్ ఫుట్‌బాల్ ప్లేయర్ బొనిగల ప్రేమయ్య ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్ బాల్ క్యాంప్ స్థానిక ఎన్.ఆర్ అండ్ పిఎం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వాకర్స్ అసోసియేషన్ పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురు ప్రసాద్, టైక్వాండో కోచ్ సయ్యద్ సలావుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రేమయ్య చిన్నారులందరిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి క్రమం తప్పకుండా నెలరోజుల పాటు పౌష్టిక ఆహారం అందిస్తూ, ఆటకు సంబంధించిన దుస్తులను ఉచితంగా అందజేస్తూ, క్యాంపు నిర్వహించడం సంతోషకరమైన విషయం అన్నారు. అనంతరం ప్రేమయ్య మాట్లాడుతూ తనకు సహాయ సహకారాలు అందిస్తున్న నేషనల్ ఫుట్ బాల్ ప్లేయర్ నరేష్, రమ్మి కుమార్, కోచ్ ప్రసన్న కుమార్ ఆర్థిక సాయం అందించిన పోలుదాసు రామకృష్ణలను ప్రత్యేకంగా అభినందించారు. నేటి నుండి ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం మే 31వ తేదీన ముగుస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫుట్ బాల్ క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆనందోత్సవాలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు వేట విరామ భృతి రూ. 20000లను వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా చీరాల నియోజక వర్గం రామాపురం సముద్ర తీరాన వేట విరామ భృతి అందించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మత్స్యకారులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చీరాల నియోజక వర్గ శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీ ఫ్రేమ్ కి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ పెంచిన వేట భృతి అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీను, కొండలు, నాగూరు, జాలయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఏ ఎం సి చైర్మన్ కౌతరపు జనార్దన్ రావు, తెదేపా నాయకులు గంజి పురుషోత్తం, జంగిలి వెంకట రామారావు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి భూముల ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర -రేపల్లె : రేపల్లె మండలం రావి అనంతపురం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంకు చెందిన 14 సెంట్లు భూమి ఆక్రమణ జరిగిందని, ఆక్రమణలను తొలగించవలసిందిగా కోరుతూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా బాపట్ల జిల్లా అధ్యక్షులు గుమ్మడి సాంబశివరావు సోమవారం రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కు వినతి పత్రం అందజేశారు. భూమిని పుట్టగుంట గోపాలరావు అక్రమంగా ఆక్రమించుకొని భూమిని విక్రయించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. పట్టణ బిజెపి అధ్యక్షులు వాకా శివరాం ప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు బేతపూడి వెంకటేశ్వర్రావు, పిన్ని సాంబశివరావు, అన్నం సాయి వరప్రసాద్, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పీజీఆర్ఎస్‌కు 44 అర్జీలు

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 44 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల వ్రాతపూర్వక అర్జీలను అడిషనల్ ఎస్పీ స్వయంగా స్వీకరించారు. వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చట్ట పరిధిలో విచారణ జరిపి నిర్దిష్ట గడువులోపు చర్యలు తీసుకోని, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్.ఐ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మున్సిపాలిటీలో రెండు కోట్ల 15వ ఆర్థిక సంఘం జనరల్ ఫండ్ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర సోమవారం తెలిపారు. ఈ నిధులతో ఇప్పటివరకు ఎనిమిది పనులు పూర్తి చేసినట్లు తెలిపారు . మే నెలాఖరుకు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల డ్రైనేజీలో నీరు నిలవ లేకుండా ఉండేందుకు పట్టణంలో మేజర్ డ్రైనేజీలలో పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు.

## వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముందుగా విద్యార్థినీ, విద్యార్థులచేత ర్యాలీ నిర్వహించి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. అదే విధంగా విద్యార్థులకు కథలు చదివి వినిపించడం జరిగింది. శిక్షణ తరగతులకు 16 మంది విద్యార్థులు సోమవారం పాల్గొన్నారు. గ్రంథ పాలకులు భాస్కర్‌రావు, ఉపాధ్యాయురాలు ప్రమీల పాల్గొన్నారు.